

హైదరాబాద్ వార్త

# మత్తులో జోగుతున్న యువత

## -కాలేజీ విద్యార్థులు సైతం -సీరియస్‌గా తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్, జూలై 9 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా అంతకంటే ముందు మాదక ద్రవ్యాలకు నిలయంగా మారుతోంది. ఒకప్పుడు అక్కడక్కడా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు విని విడ్డురంగా భావించేవారు. కాని తాజాగా వెలుగులోకి వస్తున్న మాదక ద్రవ్యాల వినియోగం చూస్తుంటే భావి తరాలు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొవాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం అవుతోంది. మాదన ద్రవ్యాల వినియోగం ఎంతలా పెరిందంటే రోగాలను నయం చేసే వైద్య విద్యను అభ్యస్తున్న వారు కూడా మాదక ద్రవ్యాలు వినియోగించేంతగా. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ వద్ద జూనియర్ డాక్టర్లకు గంజాయి విక్రహిస్తుండగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడి వ్యక్తి పాత నెరస్తుడిగా పోలీసులు గుర్తించారు. డ్రగ్స్‌ను నియంత్రించాలని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో విశ్వ ప్రయత్నం చేస్తోంది.

**నగర శివార్లలో కూడా**

నగరంలోనే కాకుండా శివారులోని పలు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గంజాయి, కొకైన్, ఓజీ, ఎల్ఎస్‌డీ, బ్లాట్స్ తీసుకున్నట్లు టీజీన్యాబ్ గుర్తించింది. కళాశాలలకు ఎత్తైన గోడలు ఇతరులు ఎవరూ లోనికి రాలేని పరిస్థితి పటిష్టమైన వ్యవస్థను సిద్ధం చేసుకొని ఉండగా వాటిల్లో కూడా మత్తు పదార్థాలు చేరుతున్నాయి. బంజారాహిల్స్, శంషాబాద్, ధూల్‌పేట్, నానక్‌రామ్‌గూడ తదితర ప్రాంతాల్లోని పెడ్లర్ నుంచి విద్యార్థులు మాదక ద్రవ్యాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే విద్యార్థులను పర్యవేక్షించాల్సిన హాస్టల్ వార్డెన్‌లు తమకేమి పట్టనట్లు డ్యూటీ సమయం అయిపోంది, మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కళాశాలల్లో విద్యార్థులు వందమంది ఉంటే కనీసం ఇరవై మంది విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డట్లు



గుర్తించారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను నియంత్రించాలని కంకణం కట్టుకున్నప్పటికి, పోలీసు శాఖ అనేక చర్యలు తీసుకున్నప్పటికి పౌరుల పాత్రమాత్రం కనిపించడం లేదు. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగం జరుగుతున్న కాలేజీల యాజమాణ్యం సహకారం లభించడం లేదని తెలుస్తోంది.

**సీనియర్‌లే కారణమా**

ఒకప్పుడు ర్యాగింగ్ జూనియర్ విద్యార్థులను వేధించినప్పటికి తాజాగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను డ్రగ్స్‌కోసం ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. కాలేజీల్లో విద్యార్థుల కదలికలను గమనించిన పోలీసులు ఈ అభిప్రాయానికి వచ్చారు. సీనియర్‌లపై ఫిర్యాదులు చేయడానికి జూనియర్‌లు జంకుతున్నారు. ముందుగా సీనియర్ విద్యార్థులకు డ్రగ్స్ కొనుగోలు చేసి ఇవ్వడానికి సహకరించిన వారే తరువాత, తరువాత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నట్లుగా గుర్తించారు. నగరంలోని ప్రముఖ విద్యాసంస్థలపై యాంటి నార్కొటిక్ పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే ఆ కాలేజీల్లో విద్యాసంస్థ యాజమాన్యం, తల్లితండ్రులకు కౌన్సిలింగ్ కూడా నిర్వహించారు. సరదాకోసమో, సీనియర్, స్నేహితుల కోసం డ్రగ్స వినియోగం ప్రారంభించి అటు తరువాత వాటికి బానిసలుగా మారుతున్నారు.

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

ఇలాంటి పరిస్థితులను సంపూర్తిగా మార్చాలని పోలీసులు కఠినంగా నిర్ణయించుకున్నారు. సమాజం ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా విద్యార్థుల భవిష్యత్తు మత్తుమయం అవుతుందని, ఇలాంటి వాటిని నివారించడంతో ప్రతి ఒక్కరి సహకారం అవసరం ఉంటుందని పోలీ సులు చెబుతున్నారు. అయితే తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీజీఎన్ఏబీ) సీరియస్‌గా తీసుకుంది. కళాశాలల్లో డ్రగ్స్ విక్రయాలు, వినియోగాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలోని కళాశాలలు, పాఠశాలలు, విద్యాసంస్థల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. టీజీఎన్ఏబీ డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం డ్రగ్స్ నియంత్రణలో పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ విద్యాసంస్థ విద్యార్థుల బ్యాగులను వందశాతం తనిఖీ చేయాలని సూచించారు. ఈ సిగరేట్స్, గంజాయి, లిక్కర్, ఉన్నట్లు ఏమాత్రం తమ తనిఖీల్లో గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# గ్రేటర్‌లో ముమ్మరంగా " లైన్ టు లైన్ సర్వే

**-కరెంట్ పోల్స్, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు పరిశీలన**
**-సాంకేతిక లోపాల గుర్తింపు..**
**టిజిఏఐఎంఎస్ యాప్‌లో నమోదు**
**-డిస్కం పరిధిలోని 3380 (11కేవీ )ఫీడర్లనుంచి వివరాలు సేకరణ**



రైటప్: సౌత్‌సర్కిల్‌లోని చార్మినార్ ఏరియాలో సర్వే తీరును పరిశీలిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫారుఖీ, ఆపరేషన్ డైరెక్టర్ నర్సింహులు తదితరులు

**హైదరాబాద్,జూలై 12,ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని నగరాల, పట్టణాలలో 11 కెవీ ఫీడర్ల సమగ్ర సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. గతనెల జూన్ 24న గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో 44పట్టణాలు, నగరాల పరిధిలో 11కెవీ ఫీడర్ల సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లోని చార్మినార్, గుల్జార్ హౌజ్, పత్థర్‌గట్టి, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని కేబుల్ బిడ్జి, అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేను టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫారుఖీ పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బంది సేకరిస్తున్న వివరాలను ఏవింగా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిఎండీ మాట్లాడుతూ సర్వే ఇప్పటికే 90శాతం పూర్తయిందని ఒకట్రెండు రోజుల్లో మొత్తం పూర్తవుతుందన్నారు. స్థంబాలు, డిటిఆర్‌ఎలు, ఆర్ఎంయూల వరకు ప్రతిదీ లెక్కించి ,జిపిఎస్‌తో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఈసర్వేలో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ వరకు అధికారులందరూ క్షేత్రస్థాయిలో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ డా.ఎన్..నర్సింహులు, ఛీఫ్ ఇంచనీర్లు పి.ఆనంద్, కె.నర్సింహ్మాస్వామి, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**వివరాలన్నీ యాప్‌లో నమోదు ..**

జిహెచ్ఎంసి పరిధిలో 675 (33కేవీ) 3,380 (11కేవీ) ఫీడర్లు ఉన్నాయి. 11కేవీ ఓవర్‌హెడ్‌లైన్స్ 21,364 కిలోమీటర్లు, ఎల్‌టి లైన్స్ 56,909కి.మీ మేర విస్తరించిన ఉన్నాయి. అలాగే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు 1.47లక్ష లవరకు ఉన్నట్లు అంచనా. వీటిపరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు, లైన్లు ఇన్సులేటర్లు,ఏబీ స్విచ్‌లు, కండక్టర్లు, డిటిఆర్‌ల వివారలను పక్కాగా సేకరించి టిజిఎస్‌పిడిసిఎల్ జిఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ మేయింటనెన్స్ సిస్టమ్"లో నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్స్,పోల్ లోకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌పార్మర్ స్ట్రక్చర్, రింగ్ మెయిన్ యూనిట్, ఆటోరీక్లోజ్, లైన్ ఏబి స్వీచ్‌ల జిఐఎస్ మ్యాపింగ్ చేయడంతోపాటు ,పోల్ పరిస్థితి (సిమెంట్, ఐరన్, రైల్వే ట్రాక్ పోల్ ), డిటిఆర్ స్ట్రక్చర్ ఎలా ఉంది, విద్యుత్ తీగల పరిస్థితి , పోల్స్‌మధ్య గ్యాప్ వంటి విషయాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. తదర్వాత భవిష్యత్‌లో లైన్ల పునురుద్దరణ పనులతోపాటు మెటీరియల్ సమకూర్చడం సులభతరం అవుతుందని తెలుపుతున్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల బాహా బాహీ..

**-బోరబండ పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత**
**-బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య లోకల్, నాన్ లోకల్ అంటూ మాటల యుద్ధం**
**-లోకల్ ఎమ్మెల్యే..కార్పొరేటర్ వర్గీయుల మధ్య బాహాబాహీ**

**పంజగుట్ట, జూలై 12 (ప్రభాతవార్త):** బోరబండ పోలీసుస్టేషన్ వద్ద హైటెన్షన్ వాతావరణంతో స్థానికంగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి.బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల మధ్య లోకల్, నాన్ లోకల్ అంటూ మాటల యుద్ధం జరిగింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ వర్గీయులు గొడవకు దిగి చెలరేగిపోయారు. తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు తాత్కాలికంగా సర్దిచెప్పి పంపడం జరిగింది.స్థానికంగా బస్తీ ఎన్నికల విషయంలో ఈ ఘర్షణ చెలరేగినట్లు సమాచారం..

**వాడు నాన్‌లోకల్..ఇక్కడ నుండి పంపేయండి..**

సాక్షాత్తూ బోరబండ పోలీసు స్టేషన్ ఎదుట ఇరువర్గాలు రెచ్చిపోవడంతో పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. మాజీడిప్యూటీమేయర్, స్థానిక కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ స్వయంగా తన అనుచరులతో పోలీసు స్టేషన్ బయట ఆందోళన చేస్తూ వీడునాన్‌లోకల్ వాడిని పంపేయండంటూ ఎమ్మెల్యే గోపీనాథ్‌ను ఉద్దేశించి పెద్దఎత్తున నినాదాలు చేయడంతో ఆయన అనుచరులు కూడా రెచ్చిపోయి నినాదాలుచేశారు. ఒక దశలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితులు ఏర్పడడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలకుసర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఒకవైపు అధికార పార్టీ అనుచరులు మరోవైపు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు గొడవకు దిగడంతో పోలీసులకు కూడా వారిని అదుపు చేయడం చాలాసమయం వరకు పట్టింది.

**అసలు గొడవకు కారణాలేంటి?.....**

బోరబండలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని కాంగ్రెస్, టీఆర్ఎస్ ల మధ్య గొడవకు స్థానికంగా ఉన్న ఓ బస్తీ ఎన్నికలే కారణంగా స్థానికులు చెబుతున్నారు. బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీ ఎలక్షన్స్ కోసం సన్నాహాలు జరుగుతున్నాయి.ఎన్నికలకు ఆర్వోగా ఒక అనర్హత వ్యక్తికి అవకాశం కల్పించారని మరో వర్గం నేతలు ఆరోపణకు దిగారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఆర్వో విషయం అడిగినందుకు తనపై ఓవర్గం నాయకులు అకారణంగా దాడి చేయడమేకాకుండా తనను కులం పేరుతో ధూషించారని ముత్యాల మహేష్ అనే వ్యక్తి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలోపలువురు పేర్లను ఉదహరిస్తూ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కూడా బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## శ్రీ చైతన్య స్కూల్‌కు బాంబు బెదిరింపు



**అత్తాపూర్ జూలై12,ప్రభాతవార్త :** శ్రీ చైతన్య స్కూల్‌కు బాంబు బెదిరింపు వచ్చిన సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది.స్కూల్ యాజమాన్యం సమాచారంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ శ్రీ చైతన్య స్కూల్‌కు చేరుకున్న పోలీసులు విద్యార్థులను బయటకు పంపించి తనిఖీలు నిర్వహించారు.ఈ విషయంపై స్పందించిన స్కూల్ ప్రిన్సిపల్ పుష్ప మాట్లాడుతూ..నాచారం బ్రాంచి నుంచి బాంబు బెదిరింపు కాల్ వచ్చినట్లు మెయిల్ ద్వారా తమను అలర్ట్ చేశారని చెప్పారు.ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు పాఠశాలకు చేరుకుని తనిఖీలు చేపట్టి ఎలాంటి బాంబు లేదని తెలియజేశారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందావద్దని ఎప్పటిలాగే విద్యార్థులను స్కూల్‌కి పంపించాలని సూచించారు.

## భక్తిరసాన్ని పండించిన శ్రీరామజయం రామదాసు విజయం నృత్యరూపకం



శ్రీరామజయం రామదాసు విజయం నృత్యరూపకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 12 ప్రభాతవార్త :** భక్తాగ్రేశ్వరుడైన శ్రీరామదాసు భక్తిభావాన్ని, భక్తిరసాన్ని పండించింది రామదాసు కీర్తనల సమాహారం శ్రీరామ జయం రామదాసు విజయం నృత్యరూపకం. కురుగంటి కళాక్షేత్రం 27వ వార్షికోత్సవ సంబరాలను పురస్కరించుకొని తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం తెలుగుజాతి వాగ్గేయకారుడు భక్తరామదాసుకు అంజలిఘటిస్తూ నృత్యగురువు కురుగంటి రాధిక 50కిపైగా శిష్యబృందం ప్రదర్శించిన ఈ కూచిపూడి నృత్య రూపకం ఆద్యంతం ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తివేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. మామిడి హరికృష్ణ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని, దాన్ని కొనసాగించేందుకు 27ఏళ్లుగా కృషిచేస్తున్న సంస్థ, గురువు రాధికను ఎంతగానో అభినందించారు. అనంతరం గౌరవ అతిథులు కంచెర్ల శ్రీనివాస్, తంగిరాల నరేష్, లంక లక్ష్మీనారాయణ, నాట్యగురువులు ఇందిరాహేమ, సంస్థ అధ్యక్షురాలు రాధిక, కార్యదర్శి డా. కుందనిక తదితరులతో కలిసి హరికృష్ణ ప్రముఖ వైద్యుడు డా. అశోక్‌సూర్యవంశీకి వైద్యరత్న; భరతనాట్య కళాకారిణి డా. సుమకు నృత్యరత్న; సీనియర్ పాత్రికేయుడు రాయప్రోలు వెంకటరమణకు పాత్రికేయరత్న; డా. వెంకటేశ్వరరెడ్డికి సేవారత్న; గోవిందాచార్యకు సంగీతరత్న అవార్డులను బహూకరించి ఘనంగా సత్కరించారు. నృత్య రూపకంలో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించి శుభాశీస్సులందజేశారు.

# నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం





**హైదరాబాద్,జూలై 12,ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం నుంచి మబ్బులు ఏర్పడి వర్షం కురిసింది. దీంతో కొద్దిరోజుల నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న నగరవాసులకు కొంత ఉపశమనం కలిగింది. ముఖ్యంగా గుండ్లపోచంపల్లి, బహదూర్‌పల్లి, పేట్‌బషీరాబాద్, సుచిత్ర,జీడిమెట్ల, కొంపల్లి, సూరారంతోపాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి ,సనత్‌నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ ,మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మెహదీపట్నం ,బంజారాహిల్స్,ఉప్పల్, తార్నాక, హబ్సిగూడ ప్రాంతంలో వర్షం కురిసింది.అలాగే రాబోయే రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

## దోపిడి దొంగ అరెస్టు...సెల్‌ఫోన్ నగదు స్వాధీనం



నిందితుడి నేర వివరాలను వెల్లడిస్తున్నన ఓ.యూ ఏసీపీ గ్యార జగన్, ఇన్స్‌పెక్టర్ రాజేందర్

**తార్నాక, జులై 12 ప్రభాతవార్త:** అర్ధ రాత్రి సమయంలో ఆటో కోసం ఎదిరి చూసున్న ఓ వృతుడి వద్దకు చేరుకున్న దొంగ తాను తక్కువ డబ్బులకే డ్రాప్ చేస్తానని నమ్మించి అతిని సెల్‌ఫోన్ ఫోన్ నగదు దోపిడీ చేసి తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు చాకచక్యంగా అతనిని అరెస్టు చేశారు. నిందితుడి నేర వివరాలను శుక్రవారం ఓ.యూ డివిజన్ ఏసీపీ జగన్ ఇన్స్‌పెక్టర్ రాజేందర్‌తో కలిసి వెల్లడించారు. తార్నాకలోని హ్యాపి హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే గోపాల్ ఇస్రో శాస్త్రవేత్తగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఈ నెల 6న తాను బెంగుళూరుకు వెళ్లాల్సి ఉండగా రాత్రి సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. కాగా అర్ధరాత్రి గడిచినా ట్రైన్ ఆలస్యం కావడంతో తిరిగి తార్నాకకు వెళ్లాలనుకున్నాడు. స్టేషన్ బయటకు వచ్చి ఆటో కోసం చూస్తున్న సయమంలో ఆక్టివాపై కూర్చున్న బోయిన్‌పల్లి డైమాండ్ పాయింట్ ప్రాంతంలో ఉండే ఆంథోని ఫెలెక్స్ ఖాన్ (29) మీరు ఎక్కడికి వెళ్లాలి అని గోపాల్‌న్ అడిగాడు. తాను తార్నాకు వెళ్లాలని చెప్పడంతో తాను కూడా అటువైపే వెళ్ళుతున్నానని తక్కు ఖర్చు రూ. రెండు వందలకే డ్రాప్ చేస్తానని నమ్మించాడు. దీంతో అది నమ్మిన గోపాల్ యాక్టివా ఎక్కాడు. ఆయన తార్నాకకు చేరుకుని యాక్టివా దిగి పెలెక్స్ ఖాన్‌కు డబ్బులు ఆన్‌లైన్లో వేసేందుకు ప్రయత్నించడంతో ఆన్‌లైన్లో వెళ్లలేదు. దీంతో గోపాల్ తన జేబులో ఉన్న నగదును తీస్తున్న క్రమంలో అకస్మాత్తుగా తన సెల్ ఫోన్‌ను, రూ.1700 నగదును లాక్కొని పారిపోయాడు. తాను చోరి చేసిన సెల్‌ఫోన్‌ను తార్నాకలో శుక్రవారం ఓ షాపులో విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు దొంగ ఫెలెక్స్ ఖాన్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ. 1000తో పాటు, యాక్టివా, సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు ఓ.యూ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి..

**-సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్ చెరువు మేయర్ ,కమిషనర్ పరిశీలన**

**నేరెడ్‌మెట్,జూలై12, ప్రభాతవార్త:** మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సఫిల్‌గూడ చెరువు సుందరీకరణ, అభివృద్ధి, గుర్రపు డెక్క పూడీకతీత తదతర సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సఫిల్‌గూడ చెరువును ఆమె నగర మేయర్ ఆమ్రాపాలీ, మున్సిపల్ అధికారులతో కలసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కారొ ్పరేటర్ శ్రావణ్ సఫిల్‌గూడ చెరువు సుందరీకరణ, అభివృద్ధి, గుర్రపు డెక్క పూడికతీత తదితర సమస్యలను ఆమెకు తెలియజేసారు. గత కొంతకాలంగా సఫిల్‌గూడ చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై తాను పోరాడడం జరుగుతుందన్నారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో సైతం తాను ఈ సమస్య గురించి తెలియజేయడం జరిగిందన్నారు. దీనివల్ల స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేసారు. అనంతరం ఆమె మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ త్వరలోనే అధికారులతో చర్చించి సఫిల్‌గూడ చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై చర్ ్చంచి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ తయారీదారులు

**-ఎన్నిసార్లు దాడులు జరిగినా మారని తీరు**
**-నకిలీ అల్లం పట్టుబడడంతో మరోసారి వెలుగులోకి ..**
**-అధికారులు నిఘా పెంచాలి**



**అత్తాపూర్ జూలై12,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారీదారులు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకోస్తున్నారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు,ఎస్ఓటీ పోలీసులు ఎన్నిసార్లు దాడులు జరిపిన నిర్వహకుల తీరు మాత్రం మారడం లేదు.ఒక చోట దాడులు చేస్తే మరో చోట వెలుస్తున్నారు. శుక్రవారం జరిగిన దాడులతో నకిలీ అల్లం వెల్లులీ పేస్టు తయారి మారోసారి వెలుగులోకి వచ్చింది. రాజేంద్రనగర్ పరిధిలో అధికంగా ఫ్యాక్టరీలు ఉండడంతో ఎక్కడో ఒక చోట స్థావరం ఏర్పాటు చేసుకొని నకిలీ వస్తువులను తయారు చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వారి వ్యాపారాన్ని నడపుకుంటున్నారని వారికి వ్యాపారం మీద ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేకుండా పోతుంది.నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు కాకుండా పరిశ్రామిక వాడలో మరికొన్ని ఇలాంటి నకిలీ తయారి జరుగుతుందని స్థానికుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నారు.రోజుకు రోజుకు నకిలీ తయారి పెరిగిపోతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.ఫుడ్ సేఫ్టీ ,ఎస్ఓటీ అధికారులు ఇలాంటి నకిలీ తయారీదారులపై నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

**నకిలీ అల్లం వెల్లులీ పేస్టు పట్టివేత :**

రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బుద్వేల్ గ్రీన్ సీటిలో అమీర్ నిజాన్ అనే వ్యక్తి గోప్యంగా అప్న ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఫ్యాక్టరీని నిర్వహిస్తూ నకిలీ



అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారని సమాచారం అందడంతో శుక్రవారం ఫ్యాక్టరీపై సైబారాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడులు జరిపారు.ఈ దాడిలో సింథటీక్ కలర్స్,యాసిడ్స్,కెమికల్ వాటర్ వాడుతున్నట్లు నిర్ధారణ కావడంతో రూ.15 లక్షల విలువ చేసే 7.3 టన్నుల పేస్ట్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాచ్‌మెన్ ఆత్మహత్య..

**మూసాపేట, జులై 12, ప్రభాతవార్త :** చిట్టీల వ్యాపారి వేధింపులు తాళలేక వాచ్‌మెన్ విద్యుత్ వైర్లు పట్టుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమ్ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట ప్రగతి నగర్‌లో భోనగిరి కనకరాజు (40) శ్రీసాయి కృష్ణ క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో జీవనం కొనసాగిస్తున్నాడు. అదే ఆపార్ట్‌మెంట్‌లో ఉషారాణి చిట్టీల వ్యాపారం చేస్తుంది. కనకరాజు ఉషారాణి వద్ద చిట్టీలు వేయడం ప్రారంభించాడు. చిట్టీ విషయంలో గురువారం రాత్రి వారి ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గొడవకంటే ముందు నుంచే ఉషారాణి ఆమె భర్త డబ్బుల విషయంలో కనకరాజును వేధింపులకు గురి చేసారని, వారి వేధింపులు తాళలేక మనస్థాపం చెందిన కనకరాజు శుక్రవారం ఉదయం ఆపార్ట్‌మెంట్‌కు వచ్చే మెయిన్ పవర్ సప్లై వద్ద విద్యుత్ తీగలను పట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్నా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టు నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## సైనికులారా ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

**-బేగంపేట టిటిఐ ఎసిపిశంకరరాజు**

**బేగంపేట జులై 12,ప్రభాతవార్త :** దేశ సరిహద్దులలో అనుక్షణం రక్షణ విధులు నిర్వర్తిస్తూ దేశ ప్రజల ప్రాణాలను కాపాడే సైనికులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు.శుక్రవారం బొలారం మద్రాస్ ఆర్మీ బెటాలియన్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు మరియూ నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దేశ సరిహద్దులలో రాత్రి పగలు తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న సైనికులు వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడు కోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఆయన అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ 5000లు జరిమానాతో పాటు మూడు నెలల వరకు జైలు శిక్షను విధిస్తారని అన్నారు.

## శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు వెల్లువ



నూతి శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ మమతసంతోష్‌గుప్తలు

**గన్‌ఫౌండ్రి, జూలై 12ప్రభాతవార్త:** రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి భాద్యతలు స్వీకరించిన నూతి శ్రీకాంత్ ను గోషామహల్ నియోకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ పి.మమత,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.సంతోష్‌గుప్తలు శాలువ కప్పి సన్మానించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఇవ్వడం జరుగుతుందనే దానికి నూతిశ్రీకాంత్ అన్నారు.10వ సంవత్సరాల పాటు కాంగ్రెస్‌పార్టీ పటిష్టత కోసం కష్టపడినట్లు చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద,బడుగు వర్గాల సంక్షేమకోసం ఎంతో కృషి చేస్తుందన్నారు.కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### నల్లపోచమ్మ దేవాలయంలో లక్ష్మణ్‌రావు గుప్త పూజలు

**బేగంబజార్,జూలై 12ప్రభాతవార్త:** ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సచివాలయంలోని నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావుగుప్త పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా నిర్వాహకులు సాయికుమార్,పి.శివలాల్,సేనా ప్రతినిధులు ఏర్రంశ్రీనివాస్,మనోజ్‌మోగలగిద్ది,నరేష్,ప్రవీణ్‌కుమార్,అస్మిత్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

### విఠలేశ్వర పాండురంగ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



విఠలేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆలయప్రధాన అర్చకులు రాజుమహారాజ్,ఈచిత్రంలోఅధ్యక్షులు.వి.కిషన్‌యాదవ్,కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్‌లు

**అఫ్జల్‌గంజ్,జూలై 12ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే జంగల్‌విఠోభాస్వామి (పాండురంగ స్వామి) ఉస్మాన్‌షాహి విఠల్‌నగర్‌లోని విఠలేశ్వర పాండురంగ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షులు వి.కిషన్ యాదవ్,కార్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్‌లు తెలిపారు. ఈమేరకు ఆలయంలో వివిధ ప్రభుత్వవిభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయప్రధాన ఆర్చకులు గోవింద్ రాజుమహారాజ్,వి.పాండుయాదవ్,రఘునందన్‌యాదవ్,పివ ాణిక్‌రావులతో కలిసి వారు మాట్లాడుతూ ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా ఈనెల 16నుంచి మొదలుకుని 24వ తేది వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ ఆలయంలో పూజలు చేస్తే కోరికలు ఫలిస్తాయని భక్తులకు అత్యంత విశ్వాసం ఉన్నందున ఈ ఆలయానికి ప్రజా ప్రతినిధులు,భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారన్నారు.ప్రతియేటా ఆషాడ మాసంలోని తొలి ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం పాండురంగస్వామి బ్రహోత్సవ పూజలు ప్రారంభమవుతాయన్నారు.విఠల్‌నగర్ ఉస్మాన్‌షాహిలో ఉన్న చారితాత్మకమైన జంగల్ విఠోభా దేవాలయంలో విఠలేశ్వర బాల భక్త సమాజ్ ఆద్వర్యంలో వేద పండితులు తెల్లవారు జామున బ్రహ్మముహుర్త మునమహాభిషేకం, పూజ,హారతితదితర పూజాధికాలను చేయడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో ఆలయకమిటి ప్రతినిధులు మల్లేశం, గణేష్,యాదవ్,కట్టరమేష్‌ముదిరాజ్,బోయినివెంకటేష్‌యాదవ్ ట్రాఫిక్,జిహెచ్ఎంసి,విద్యుత్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### పన్నులు ఎగవేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయరాఘవ

**సైఫాబాద్, జులై 12 ప్రభాతవార్త:** అక్రమంగా కోట్లాది రూపాయలు సంపాదించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లించకుండా మోసం చేస్తున్న వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, అక్రమ ఆస్తులను స్వాదీనం చేసుకోవాలని బాధితులకు న్యాయం చేయాలని నేషనల్ సోసైటీ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ (ఎన్ఎస్‌హెచ్ఆర్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోసైటీ సలహాదారు, విశ్రాంత తహసీల్ధార్ విజయరాఘవన్, రాష్ట్ర కార్యానిర్వాహక అధ్యక్షుడు ప్రశాంత్ రిపిక, ప్రధాన కార్యదర్శి సాయితేజ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, సుభాన్‌పూర్‌లోని పలు సర్వేల్లో కర్నూల్‌కు చెందిన కుందూరు మహేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి చట్ట విరుద్ధంగా పలు వెంచర్లు వేసి ఒకే ప్లాట్‌ను ఇద్దరూ ముగ్గురికి విక్రయిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా 21 ఎకరాల 31 గుంటలలో అక్రమ లే అవుట్ ద్వారా ప్లాట్లు చేసి 40 కోట్ల రూపాయలు సంపాదించారని, అతనిపై పలు పోలీస్ స్టేషన్‌లలో పిడియాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయని వారు చెప్పారు. ఈ అక్రమ వెంచర్లను ప్రభుత్వం స్వాదీనం చేసుకుని, ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులకు తిరిగి అప్పగించాలని వారు కోరారు. అతని వద్ద నుంచి రావాల్సిన పన్నుల డబ్బులు రాబట్టాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### ఆటో డ్రైవర్ల శ్రమకు తగ్గ ప్రతిఫలం

**సైఫాబాద్, జులై 12 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల శ్రమకు తగ్గ లాభం పూర్తిగా వారికే చేందేలా, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా దేశంలో తొలిసారిగా 'ఓల్టా యాప్' ప్రారంభమైంది. కమీషన్ లేకుండా ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు లాభదాయకంగా ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ఓల్టా సిఈఓ రాజా విక్రం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎఐటియుసి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పోరేట్ రైడింగ్ యాప్‌లు ఒక వైపు ప్రయాణికులకు చార్జీల మోత మోగిస్తూ మరొక వైపు ఆటో డ్రైవర్ల శ్రమను దోచుకుంటున్నాయని ఆరోపించారు. ఓల్టా యాప్ ఆటో డ్రైవర్ల నుంచి ఏలాంటి కమీషన్, ప్లాట్ ఫామ్ చార్జీలు తీసుకోదని, రైడింగ్‌కు వచ్చే మొత్తం డబ్బులను డ్రైవర్లకే చెల్లిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఈ యాప్‌లో ఇప్పటికే 40 వేల మంది ఆటో డ్రైవర్లు తమ పేర్లను రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని, ప్రతి రోజు 36 వేల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నారని, డ్రైవర్లకు పది లక్షల రూపాయల బీమా సౌకర్యం, 24 గంటలు కస్టమర్ కేర్ సపోర్ట్‌ను, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయం కోసం ఎస్ఓఎస్ విధానాన్ని ఓల్టా సంస్థ కల్పిస్తున్నదని వారు వివరించారు. ప్రయాణికులకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఒకే విధమైన చార్జీలు ఉంటాయని, పీక్ అవర్స్‌లో అదనపు చార్జీలు ఉండవని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉదయ్‌భాస్కర్, సాయిరామ్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావు

### -రాష్ట్రంలో కొత్తగా మరో 40 ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రయత్నం

**గచ్చిబౌలి, జూలై 12 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సేవలు అందించేందుకు కొత్త ఫైర్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ నూతన డైరెక్టర్ జివి.నారాయణరావు అన్నారు. ప్రస్తుతం నగరంలో ఉన్న ఫైర్ స్టేషన్లతో పాటు కొత్తగా 7 ప్రాంతాల్లో ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన జివి.నారాయణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన నారాయణరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 146 ఫైర్ స్టేషన్లు సేవలు అందిస్తున్నాయని, కొత్తగా మరో 40 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. నూతన ఫైర్ సర్వీస్ యాక్ట్‌ను సైతం తీసుకువస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంపై ద ృష్టి సారిస్తున్నామని అన్నారు. ఫైర్ సర్వీసెస్‌లో కొత్తగా 450మంది కానిస్టేబుళ్ల నియామకం చేపడుతున్నామని, ప్రస్తుతం ట్రైనింగ్ దశలో ఉన్నారన్నారు. గతంలో తమ శాఖలో డ్రైవర్ల కొరత ఉండేదని, ప్రస్తుతం మరో 200మంది డ్రైవర్ల నియామకానికి సిద్ధమైనట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుతుందని, భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. భారీ బహుళ అంతస్థుల నిర్మాణాల్లో అడ్రసబుల్ అలారమ్ సిస్టంతో ఫైర్ కమాండ్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేస్తున్నామని, ప్రతి భవనం కంట్రోల్ సిస్టంను ఫైర్ సర్వీసెస్ కేంద్ర కార్యాలయానికి అనుసంధానం చేస్తామని అన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌ను సైతం మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. భారీ భవనాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలు తమ సేవలు, పిర్యాదుల కోసం డయల్ 101లో సంప్రదించాలని సూచించారు.

### శాఖాంబరీ దేవి అలంకారంలో శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారు

**బేగంపేట జూలై 12,ప్రభాతవార్త**

ఆషాడ బోనాల జాతరలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారు శాఖాంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా అమ్మ వారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు.శాఖాంబరీ దేవి రూపంలో ఉన్న అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసారు.ఉదయం,సాయంత్రం సమయంలో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.ఈ సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల పూలతో పాటు వివిధ రకాలైన కూరగాయాలు,ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు.భకులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో ఆలయం కిట కిట లాడింది.

### బోనాల ఉత్సవాలకు చెక్కులు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 12 ప్రభాతవార్త:** లష్కర్ బోనాలు బారీ ఎత్తున నిర్వహించేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన బోనాల వేడుకలకు చెక్కులు పంపిణీ చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లి నెహ్రూ నగర్ పార్కులో నిర్వహించిన బోనాల ఉత ్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బోనాల ఉత ్సవాలు ఘనంగా జరిపేందుకు 20 కోట్ల రూపాయలు పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 218 ఆలయాలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఇన్‌ఛార్జి తహాశీల్దార్ అశోక్, డిప్యూటీ తహాశీల్ధార్ శివకుమార్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్ యాదవ్, చిరబోయిన సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, నాగినేని సరిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : మజ్దూర్ యూనియన్



ధర్నాలో ప్రసంగిస్తున్న మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 12 ప్రభాతవార్త:** రైల్వేలో పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు కార్మిక సంఘాలు, ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్వే సంచాలన్ భవన్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమిస్తామన్నారు. ముందుగా సికింద్రాబాద్ డి.ఆర్.ఎం. ఆఫీస్ నుంచి బారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి కామ్రేడ్ రవిందర్, ఏజి.ఎస్.కార్యదర్శులు ఉదయ భాస్కర్, మురళీధర్,సరోజినిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, వరప్ర సాద్, ఖాజా బాబా, నవీన్, సిసి.ఎస్. అధ్యక్షులు చిలుక స్వామి, నర్సింహ్మారెడ్డి, నాగలక్ష్మి, రామోహన్ పాల్గొన్నారు.

### నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, జూలై 12, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశం హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ పరిధిలోని ఆయా డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమీషనర్ రామకృష్ణరావు, ఎమ్మార్వో పూల్‌సింగ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బేగంపేట్‌లో జరిగిన నికాన్ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

### అవంతి ఇంజనీరింగ్ కాలేజికి నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

**-ఇతర కోర్సులతో పాటు ఆర్ ఎండ్ డీ కి ప్రాధాన్యత**

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ ఎసెస్‌మెంట్ ఎండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ)లో 'ఏ' గ్రేడ్ గుర్తింపు లభించినట్లు మాజీ మంత్రి, అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం బర్కత్‌పురా ప్రాంతంలోని అవంతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాల 1992లో ప్రారంభించబడిందని, గతంలో ఈ కళాశాలకు 'బీ' గ్రేడ్ ఉండేదని, కాని ఈ విద్యా సంవత్సరంలో ఎన్ఏసీ ఏ గ్రేడ్ ఇచ్చిందని తెలిపారు. విద్యార్థులకు శిక్షణతో పాటు ఇతర కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నామని, ఈ విషయాన్ని ఎన్ఏసీ పరిగణలోకి తీసుకుందని పేర్కొన్నారు. విద్యార్థులందరికీ డేటా సైన్సు, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి వివిధ కోర్సులు బోధిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ కళాశాలలో ఎంఒయు ఒప్పందం చేసుకున్నామని, (ఆర్ఎండ్‌డీ) రీసెర్చ్ ఎండ్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల కార్యదర్శి ఎం.ప్రియాంక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### దేవాలయాలకు చెక్కుల పంపిణీ

**హైదరాబాద్, జులై 12 ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల దశాబ్ధి ఉత్సవాలు-2024 దేవాలయాలకు చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో ప్రారంభించారు. మొత్తం 128 దేవాలయాలకు 50,38,000 రూపాయలకు గాను చెక్కుల పంపిణి తొలి విడతలో భాగంగా 74 దేవాలయాలకు అందజేశారు. మిగతా 54 దేవాలయాలకు రెండో విడతలో చెక్కులు పంపిణి చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, దూసరి శ్రీనివాస్‌లావణ్యగౌడ్, కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, ఎంఆర్‌ఓలు వీరబాయి, సంధ్యారాణి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, బిఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

### దోమల నివారణతోనే వ్యాధులు దూరం



దోమలనివారణపై అవగాహన కల్పిస్తున్న డీఎంసీ ఖాదర్ మోహినుద్దీన్, ఏఎంహెచ్ఓ మైత్రేయి, వైద్యాధికారి దీప్తి ప్రియాంక తదితరులు

**ముషీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**

దోమల నివారణతోనే వ్యాధులు దూరం అవుతాయని మున్సిపల్ డిప్యూటి కమీషనర్ ఖాదర్ మోహినుద్దీన్, ఏఎంహెచ్ఓ మైత్రేయి, వైద్యాధికారి దీప్తి ప్రియాంక అన్నారు. శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై ముషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు దోమలేనని, దోమలు మన పరిసరాలలో లేకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఎక్కడా నీరు నిలవ లేకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటి ఐఓఎస్ స్వరూపరాణి, జీహెచ్ఎంసీ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గా ప్రసాద్, ఏఈ మహేష్, పిహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

### భవనం పైనుంచి దూకేందుకు ప్రయత్నించిన వ్యక్తిని రక్షించిన పోలీసులు



రమేష్‌ను కిందికి తీసుకువస్తున్న పోలీసులు

**ఎల్.బి.నగర్, జూలై 12 ప్రభాతవార్త:** భవనం పైనుంచి దూకేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు రక్షించారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ నివాసి తాళ్లపల్లి రమేష్ (45) సెంట్రింగ్ పనిచేసేవాడు. శుక్రవారం రమేష్ భార్య, కొడుకు తిట్టారని కోపంతో మద్యం సేవించాడు. మద్యం సేవించిన మైకంలో చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనంపైన ఉన్న వాటర్‌ట్యాంక్ పైకి ఎక్కి చనిపోతానని కేకలు పెట్టాడు. అది గమనించిన స్థానికులు వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. వెంటనే చైతన్యపురి పోలీసులు సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని రమేష్‌ను జాగ్రత్తగా కిందికి తీసుకువచ్చారు.

### వనస్థలిపురం వివాహిత హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబ్బు, నగల కోసం ఒక వివాహితను ఉరివేసి హత్య చేసిన ఇద్దరు నిందితులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. ఈ మేరకు అరెస్టయిన నిందితులను మధురైకు చెందిన ఇద్దరు వెల్లై స్వామినాయుడు రాజ్‌కుమార్(30), ముత్తురామ్ అయ్యర్(32)లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరు పరచగా డబ్బు నగలకోసం మహిళను హత్య చేసినట్టు తేలింది. దాంతో కోర్టు నిందితులిద్దరికీ యావజ్జీవ శిక్షతో పాటు రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

## పరిసరాల పరిశుభ్రతతోనే అంటు వ్యాధులు దూరం

**- బండ్లగూడ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్**



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో "ఫ్రైడే-డ్రైడే" కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ మద్దెల లతాగౌడ్.

**నార్సింగి, జూలై 12 ప్రభాతవార్త :**

పరిసరాల పరిశుభ్రతతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లత ప్రేమ్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 8,12, వార్డుల పరిధుల్లో కమీషనర్ శరత్‌చంద్రతో కలిసి "ఫ్రైడే-డ్రైడే" కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభంలో కురిసే వానలకు ఈగలు, దోమలు, వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా వ్యాధులను వ్యాపింపచేస్తాయన్నారు. నీరు, చెత్త నిలువ ఉండే ప్రాంతాలలోనే ఇవి వేగంగా వృద్ధి చెందుతాయని, ఇంటి లోపల, బయట ఉండే పాత టైర్లు, కుండలు, చెట్ల పొదలలో చెత్త, నీరు నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. మన అజాగ్రత్తనే మనలను అంటు వ్యాధులకు గురి చేస్తుందని, మన జాగ్రత్తనే మనకు ఆరోగ్యంను ఇస్తుందని వివరించారు. రోగాలు వచ్చాక అవస్థలు పడేకన్నా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం మంచిదని సూచించారు. తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పలువురు ప్రజల ఇళ్లకు వెళ్లి అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాము, భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఫ్రైడే-డ్రైడే ఉత్సవాలను కిస్మత్ పూర్‌లో కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, బండ్లగూడలో కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ తదితరులు నిర్వహించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

## చలో కామారెడ్డి పేరిట 14 నుంచి సమగ్ర కులగణన సాధన యాత్ర

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు

**సైఫాబాద్, జులై 12 ప్రభాతవార్త:**

బిసిల కులగణన కోసం 'చలో కామారెడ్డి' పేరిట ఈ నెల 14వ తేదీ నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన సాధన యాత్ర నిర్వహిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 14వ తేదీన కామారెడ్డిలో ఈ యాత్ర ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతూ 31వ తేదీన కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బిసిల రిజర్వేషన్‌లను జనాభా దామాషా ప్రకారం పెంచేవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో బిసిలకు తాము అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతంకు రిజర్వేషన్‌లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చి బిసి డిక్లరేషన్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ బిసి డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తు చేయడానికి ప్రభుత్వంపై నిరంతరం వత్తిడీ చేయడానికి కామారెడ్డి నుంచే ఈ యాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ యాత్రలో బిసి మేధావులు, కుల సంఘాలు, విద్యావంతులు, మహిళలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి కుల సంఘాల జెఏసి ఛైర్మన్ కుందారం గణేషాచారి, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్, నాయకులు తాటికొండ విక్రమ్‌గౌడ్, శ్యాం, మహేష్‌యాదవ్, మల్లికార్జున యాదవ్ గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకుందాం

**-ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్**



బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

**ముషీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** ఆషాఢంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా జరుపుకునే బోనాల పండుగ ఉత్సవాలని వైభవంగా నిర్వహించుకుందామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని దేవునితోట భవానీ శంకరాలయంలో బోనాల ఉత్సవాలకు సంబంధించి ముషీరాబాద్ నియోజకవర్గంలోని 186 దేవాలయ కమిటీలకు చెక్కులను వారు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పండుగలను ప్రశాంత వాతావరణంలో కలసి మెలసి నిర్వహించుకుందామని అన్నారు. మన రాష్ట్రంలో బోనాల ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, అందులో భాగంగానే ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బోనాలకు తెలంగాణ ప్రభుత్వం చెక్కులను అందచేస్తోందని తెలిపారు. గత ఏడాదది కంటే ఈ ఏడాది పది శాతం నిధులను పెంచి ప్రతి దేవాలయానికి చెక్కులు ఇవ్వటం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియగౌడ్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, ముషీరాబాద్ ఎమ్మార్వో గోవర్ధన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, రాకేష్‌కుమార్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకటేష్, మహేందర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు కల్పనాయాదవ్, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలు : ఎమ్మెల్యే తలసాని



దేవాలయాలకు ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేస్తున్న రాజ్య సభ సభ్యుడు అనిల్‌కుమార్,డిప్యూటీ మేయర్ శ్రీలత,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట జూలై 12,ప్రభాతవార్త**

తెలంగాణా సంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.శుక్రవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయ ఆవరణలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని 256దేవాలయ కమిటీల సభ్యులకు 1.69కోట్ల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్,డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి,కార్పొరేటర్లు టి.మహేశ్వరి,కొంతం దీపిక,కాంగ్రెస్ ఇంచార్జి కోట నీలిమ,మాజీ కార్పొరేటర్ కిరణ్మయి,దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలి : తలసాని.**

సికింద్రాబాద్ లోని శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం పరిసరాలలో శనివారం వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించనున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.శుక్రవారం మహాకాళీ ఆలయం వద్ద చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.ఈ నెల 21వతేదీన జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ ,దేవాదాయ,వాటర్‌వర్క్స్,ఎలక్ట్రికల్ ,హెల్త్,పోలీస్,ట్రాఫిక్ పోలీస్,అగ్నిమాపక తదితర శాఖలకు చెందిన అధికారులతో కల్సి సమీక్షిస్తారు.బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మ వారి దర్శనానికి ప్రతి ఏటా వివిధ ప్రాంతల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారని,ఈ ఏడాది కూడా అమ్మ వారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు,చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగు సూచనలు,ఆదేశాలు ఇస్తారు.

### ఆరోగ్యమిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో న్యాయం జరిగేలా కృషి

**-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో అన్ని సమస్యల పరిష్కారానికి న్యాయం చేస్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీఇచ్చారని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మిత్రల రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమ సమస్యల పరిష్కారానికి ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గిరి యాదయ్య మాట్లాడుతూ కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్య మిత్రలు చేస్తున్న సేవలను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్‌ను కేటాయించాలని, కనీస వేతనంగా రూ.35వేలు చెల్లించడంతో పాటు టిఎ, డిఎ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులందరికి హెల్త్‌కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 20,21 తేదీల్లో "స్టైల్ తత్వ " ఎగ్జిబిషన్

**హైదరాబాద్,జూలై 12,ప్రభాతవార్త:** మహిళా సాధికారత, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం కోసం ఫిక్కీ లేడిస్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్ సెంటర్‌లో రెండురోజుల పాటు "స్టైల్ తత్వ " పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఎఫ్ఎల్‌వో ఫ్లో హైద్రావిడ్ చైర్‌పర్సన్ ప్రియా గజాదర్ తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడలోని ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండురోజులపాటు జరిగే ఈకార్యక్రమాన్ని సినీనటి సుమకనకాల ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో 15రాష్ట్రాల నుంచి 200లకు పైగా ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం ఉంటుందని దీంట్లో 212 స్టాల్స్‌లో వివిధ రకాల ఆవిష్కరణలను ప్రదర్శించన్నుట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, జ్యూవెలరీ ఎక్స్‌పో,తోపాటు పారిశ్రామిక వేత్తల పెవిలియన్, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్‌లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటివి ఉంటాయన్నారు. స్టైల్ తత్వ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా వందమంది మహిళా రైతులకు ఆధునిక కూరగాయల సాగులో శిక్షణ ఇవ్వడం, సిద్దిపేట క్లస్టర్‌లో నైపుణ్యం పెంచే నేత కార్మికులకు శిక్షణ వంటి సామాజిక కార్యక్రమాలకు కేటాయించబడుతుందని తెలిపారు.

### ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ మార్షల్స్ నియామకం

**-ట్రాఫిక్ నియంత్రణా చర్యల్లో ఓ భాగం**



ట్రాఫిక్ మార్షల్ నియామకాల కార్యక్రమంలో మాట్లాడుతున్న కమీషనర్ అవినాశ్ మహంతీ

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:**

కొత్తగా నియమించబడిన ట్రాఫిక్ మార్షల్ బృందాలు నిబద్ధతతో పని చేయాలని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాశ్ మహంతి అన్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించబడ్డారు. శుక్రవారం సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో ట్రాఫిక్ మార్షల్ బృందాల నియామకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రసంగిస్తూ, ట్రాఫిక్‌లో పూర్తి స్థాయి విధులను అప్పగించినందుకు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పోలీస్ శాఖకు వన్నె తెచ్చే విధంగా ట్రాఫిక్ మార్షల్స్ క్రమశిక్షణతో విధినిర్వహణలో పాల్గొనాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ జాయంట్ కమీషనర్ డి.జోయల్ డేవిస్ ట్రాఫిక్ మార్షల్స్‌ను అభినందిస్తూ వారికి తగ్గ భరోసా కల్పించారు. మార్షల్ బృందాలకు కంపెనీల సహాకారంతో ఆకర్షణీయమైన వేతనం చెల్లించబడుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలన్నీ పూర్తి స్థాయిలో వీరే పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శివకుమార్ వీరన్న, మాధాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం, కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ వేంకటయ్య, ఎస్సీ ఎస్సీ ప్రతినిధులు రమేశ్ రాజా, రాజేష్, రహేజా మైండ్ స్పేస్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## చేపపిల్లల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అండ : సాయికుమార్



చేపపిల్లల ఉత్పత్తిదారులతో సమావేశమైన చైర్మన్ మెట్టు సాయికుమార్.

**మెహిదీపట్నం, జూలై 12, ప్రభాతవార్త :** చేపపిల్లల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్‌లో శుక్రవారం చేప పిల్లల ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించడంతో రాష్ట్రంలో రూ.74 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని ఉత్పత్తిదారులు చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేపపిల్లల ఉత్పత్తిదారులకు రూ.74 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయంపై మత్స్యశాఖ కమిషనర్ డా.ప్రియాంక అలాతో చర్చించితో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బిల్లులు వెంటనే విడుదలయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులకు ఏవైన సమస్యలుంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో చేపపిల్లల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలి
### -కార్పొరేటర్ హేమలతాసురేష్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, జూలై 12, ప్రభాతవార్త** మొక్కలు నాటడాన్ని అందురు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ విడిఆర్ కాలనీలో స్థానికులతో కలిసి మొక్కలు కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లను సంరక్షించే బాధ్యత కూడా అధికారులు తీసుకోవాలని సూచించారు. చెట్లు నాటడం సమాజానికి, మొత్తం మానవాళికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చెట్లు మనకు ఆహారం, ఆక్సిజన్, మంచినీరు, ఇంధనం, నివాసం మనం జీవించడానికి కావల్సిన ప్రతిదాన్ని అందిస్తాయన్నారు. స్థిరమైన జీవనానికి దోహదపడే మొదటి అడుగు పర్యావరణానికి ఏదైనా తిరిగి ఇవ్వడం అలవాటు అని అన్నారు. మీ ఇంటిచుట్టూ ఎక్కువ చెట్లను నాటడం వల్ల గాలిని శుద్ధి చేయడం ద్వారా గాలి నాణ్యత మెరుగు పడుతుందన్నారు. మరి ముఖ్యంగా చెట్లు గాలిలో ఆక్సిజన్ స్థాయిలను పెంచుతాయి, ప్రమాదకరమైన కాలుష్య కారకాలను తొలగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మున్సిపల్ అధికారులు, సీనియర్ నాయకులు అనిత, సమైక్య అధ్యక్షురాలు సత్యవాణి, మహిళా అధ్యక్షులు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, అంజయ్య, నరేందర్‌రెడ్డి, భరత్, ప్రభాకర్, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి హుండీ లెక్కింపు
### - మొదటి, రెండో పూజకు వచ్చిన రూ.2 లక్షల 91 వేల 940



**మెహిదీపట్నం, జూలై 12, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి (ఎల్లమ్మ తల్లి) అమ్మవారి హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. అమ్మవారికి మొదటి. రెండవ పూజకు వచ్చిన భక్తులు హుండీలో వేసిన డబ్బులు 2 లక్షల 91 వేల 940 రూపాయలు వచ్చాయని దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్‌రాజు, ఆలయ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్‌లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో కమిటీ సభ్యులు చంటిబాబు, శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, రేణుక, గోల్కొండ జగదాంబ మహంకాళి దేవాలయ ప్రొఫెషనల్ వర్కర్స్ సంఘం అధ్యక్షులు సాయిబాబాచారి, సురేష్‌చారి, లీలావతి, నరేష్, ప్రసాద్‌లు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోటు పుస్తకాలు పంపిణీ

**జగద్గిరిగుట్ట, జూలై 12, ప్రభాతవార్త** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పే బ్యాక్ అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థుల కోసం అంబేద్కర్ సేవా సమితి వారు అందించిన ఆర్థిక సహాయాన్ని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కుమార్, వీరయ్య, ప్రసాద్, శ్యామ్, దాసు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, మిట్టల్ ముదిరాజ్, సిహెచ్ దాసు, నరసింహారెడ్డి, హనుమంతు, బ్రహ్మానందం చారి, యాదగిరి, సత్తిరెడ్డి, సంతోష్ కుమార్, మనోహర్, అప్పిరెడ్డి, ఆదిలక్ష్మీ, సంధ్యసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢమాసం అమ్మవారికి ప్రత్యేక పూజలు..



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, జూలై 12, ప్రభాతవార్త** ఆషాఢమాసం అమ్మవారి పూజల నిమిత్తం శ్రీ దుర్గామాత ఆలయానికి రూ.55వేలు ప్రభుత్వం తరపున చెక్కును అందజేసి సహకరించిన మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బాపునగర్ ప్రెసిడెంట్ హరిసింగ్ జాదవ్ శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరిసింగ్ జాదవ్, గోపిలాల్ చౌహాన్, విక్రమ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో "ఫ్రైడే-డ్రైడే" ఉత్సవాలలో పాల్గొని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్

# ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మూసాపేట్, జూలై 12, ప్రభాతవార్త** వర్షాకాలం నేపథ్యంలో 124 డివిజన్ పరిధిలోని శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిహెచ్‌ఎంసి ఎంటమాలజీ సిబ్బంది దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ విచ్చేసి విద్యార్థులకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ఉత్పత్తిని ప్రతి ఒక్కరు అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, పాఠశాల హెచ్.ఎం.నరసింహులు, ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం. సుందరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో..**

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయం వద్ద కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జిహెచ్‌ఎంసి సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మన ఇంటి ఆవరణలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్నచో అట్టి నీరును తనిఖీ చేసి పారబోయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసి కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూ ఎం.మోహ న్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ మమతా, ఎంటమాలజీ ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

## మనోహరంగా అంతర్జాతీయస్థాయిలో సింగిడి నృత్యాంగన

**రవీంద్రభారతి, జూలై 12 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి కశాఖ, ప్రముఖ సింగిడి సాంస్కృతిక సంస్థ, జీవితబీమా సంస్థ సంయుక్త ఆధ్వ ర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంతర్జాతీయస్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పలు దేశాలకు చెందిన కళాకారులచే సింగిడి 2వ నృత్యాంగన నయన మనోహరంగా నిర్వహించనున్నారు. ఈ నెల 15 సోమవారం సాయంత్రం 5గంటల నుండి ప్రారంభమయ్యే ఈ నృత్యాంగనలో మలేషియాకు చెందిన డా. ఇంద్రాణి సుగుమార్ బృందం; బెంగళూరుకు చెందిన పాయెల్ మంజుంధర్ మండల్, మీనాక్షి మండల్‌లచే ఒడిస్సీ; ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకా రులచే శాస్త్రీయ నృత్యప్రదర్శనలు ఉంటాయని సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డి.ఆర్.కె మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసులు, పరాతత్వశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, గౌరవ అతిథులుగా మాజీ పార్లమెంటు సభ్యుడు డా. మంద జగన్నాథ్, డా. మామిడి హరికృష్ణ, బాలాజీ కిరణ్, సినీ నృత్యదర్శకుడు సత్యలతోపాటు సింగిడి సాంస్కృతిక విదేశీ ప్రతినిధులు హాజరవుతారని డి.ఆర్.కె.విశ్వకర్మ తెలిపారు.

## కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలి
### -అఖిలభారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ బిట్ల



.సుభాష్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** దేశంలో వివిధ రాష్ట్రాలలో సఫాయి కర్మచారి కార్మికులకు చెల్లింపుల వేతనాల చట్టం-1936, 1948, 1972, 2000 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అఖిలభారతీయ సఫాయి మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుభాష్ ప్రమాణస్వీకారోత్సవ సభజరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ బిట్ల మాట్లాడుతూ త్వరలోనే దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి కార్మికులకు కనీసం రూ.25వేల నుంచి రూ.30వేల వేతనం ఇవ్వటంతో పాటు అన్ని రకల బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో రాంకీలలో పనిచేస్తున్న స్వీపింగ్ ఇతర రంగాలలో ఉన్న కార్మికుల కోసం మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతామన్నారు. డి.సుభాష్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయడంతో పాటు అభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు పేరు, ప్రఖ్యాతలను తీసుకువచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్మసింగ్ కర్మ, రాజ్‌పాల్ మెహ్రోలియా, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఇంచార్జ్ ఢిల్లీ విశాల్ చన్వారియా, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు మురారి లాల్ బాగ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ధరమ్ వీర్‌చండాలియా, ఉపాధ్యక్షుడు విజయ్ కంగాడ, సత్యనారాయణ, చమన్‌సింగ్, సురేంద్ర, ప్రధాన కార్యదర్శి కిషన్ దుల్గజ్, ప్రకాశ్ బిట్ల, కిషన్, విశాల్, రాజేంద్ర పప్పు తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌ఓల సమస్యలను సిఎం , మంత్రి దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యఓఉడు కె.విజయ్‌రావు తదితరులు

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** గత తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ శాఖ నుంచి తొలగించిన విఆర్‌ఓలను తిరిగి అదే శాఖలోకి తీసుకుని వారికి న్యాయం చేయాలనే అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హైదరాబాద్ జిల్లా విఆర్‌ఓ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ సభ్యులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారు. శుక్రవారం విఆర్‌ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రావు పిలుపుమేరకు ఎమ్మెల్యేలకు తమ డిమాండ్ల పరిష్కారానికి సంఘం జిల్లా అధ్యక్షులు వినతిపత్రాలను ఇవ్వాలని ఇచ్చిన పిలుపు మేరకు సంఘం జిల్లా అధ్యఓఉడు కె.విజయ్‌రావు ఆధ్వర్యంలో దానం నాగేందర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. విజయ్‌రావు విలేకరులతో మాట్లాడారు.రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విఆర్‌ఓలను తన మాతృసంస్థల అయిన రెవెన్యూ శాఖలోకి తీసుకుంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సిహెచ్.మనోమార్, పి.విజయకుమార్, పాకరాజు, కె.రాజు, ఎ.కృష్ణంరాజు, కాంగ్రెస్ నేతలు కెన్నడీ రాజు, అభిషేక్ కెన్నడి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంరక్షణలోని సాలార్జంగ్ భూములు కొనుగోలు చేయొద్దు

**హైదరాబాద్,జూలై 12,ప్రభాతవార్త:** ఇటీవల పిర్జాదిగూడలో వివాదాస్పదమైన ప్రభుత్వ సంరక్షణలో ఉన్న సాలార్జంగ్‌కు చెందిన స్థలాలను కొనుగోలు చేయవద్దని సాలార్జంగ్ బావమరిది అబ్దుల్ వాహెద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది జితేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌లతో కలిసి మాట్లాడారు. నిజాం తదనంతరం ప్రధానిగా పనిచేసిన సాలార్జంగ్‌కు ఆప్రాంతంలో 362 ఎకరాల 15గుంటల స్థలం ఉందన్నారు. కాగా సదరు స్థలంపై నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి విక్రయిస్తున్నారని అన్నారు. సదరు స్థలాలను కొనుగోలు చేసినవారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. క్రయవిక్రయాలను ఆపాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈదుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వాన్ని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయాలు జరగకుండా అడ్డుకట్టవేసి పేద, మధ్యతరగతి ప్రజలు మోసపోకుండా కాపాడాలని కోరారు. ఈవిషయంపై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నారు.

## డ్రైనేజీ, రోడ్ల విస్తరణ, మరమ్మతులు చేపట్టాలి..
### -కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసిన కాంగ్రెస్ నేతలు..



జోనల్ కమీషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త** కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ఆధన్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ నాయకులు పలువురు ప్రజాప్రతినిధులు జోనల్ కమీషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రధానంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జోనల్ కమీషనర్‌ను కోరారు. రోడ్లపై పడిన గుంతలను శరవేగంగా పూర్తి చసి మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా చెదారంతోపాటు మట్టి దిబ్బలు, ఇసుక కుప్పలను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, విట్టల్‌రెడ్డి, రాఘవేంద్ర రావు, ప్రవీణ్ కుమార్, కృష్ణరాజ్‌పుత్, సతీష్‌గౌడ్, మెయినుద్దీన్, కె.రమేష్ కుమార్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఛాంపియన్‌గా హైదరాబాద్ గ్రూప్ 'తల్ సేనా క్యాంప్'
### -ప్రతిభ కనబర్చిన అంబేద్కర్ కళాశాల విద్యార్థి వంశీసాగర్

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** ఎన్‌సిసి తెలంగాణ బెటాలియన్ నుంచి పదిహేను మంది కెడెట్లు ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా హైదరాబాద్ గ్రూప్ 'తల్ సేనా క్యాంప్' నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం పోటీలలో పాల్గొని విజయవంతంగా తిరిగి వచ్చిన ఎన్‌సిసి కెడెట్లకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభించింది. తెలంగాణ బెటాలియన్‌లో బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఇంటర్ విద్యార్థి బి.వంశీసాగర్ హైరాబాద్ జట్టు గెలవడానికి తనవంతు పాత్ర పోషించిన సందర్భంగా కళాశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. తల్‌సేనా క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూనాథ్ నేతృత్వంలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలువడం సాధ్యమైందని కళాశాల ఎన్‌సిసి విభాగం అధికారి ఎం.కిరణ్‌కుమార్, ఆర్మీ సిబ్బంది అభినందించారు. ఈ పోటీలలో పలువురు ఎన్‌సిసి కెడెట్లు వ్యక్తిగతంగా బంగారు పతకాలను గెలుపొందారు.

# అక్టోబరు 2ను గ్లోబల్ పీస్ ర్యాలీ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కె.ఎ.పాల్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2వ తేదీన గ్లోబల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని పేరేడ్‌గ్రౌండ్‌లో 'గ్లోబల్ పీస్ ర్యాలీ'ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని కమిటి ప్రతినిధి డా.కె.ఎ.పాల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కమిటీ ప్రతినిధులు రోశయ్య, జ్యోతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.ఎ.పాల్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహకారంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీకి దేశ, విదేశాల నుంచి ఎంతో మంది ప్రముఖులు హాజరవుతారని, దేశంలోని 18 రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటారని చెప్పారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, తెలంగాణ రాష్ట్రానికి వందల పరిశ్రమలు రావాలని, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు రావాలని కోరుతూ ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని చెప్పారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జరిగే ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
మల్కాజ్‌గిరి సర్కిల్-28

నిట్ నం. కొటేషన్ ప్రకటన నం. 2/EE-28/SBZ/GHMC/2024-25

పనిపేరు: S/f HD డబుల్ హెల్త్ వాకర్, స్క్రైవాకర్, చెస్ట్‌పుష్, ట్విస్టర్ 3 ఇన్ 1, షోల్డర్ వీల్ డబుల్, AB బోర్డ్, మినీ స్లైడ్ (లాడర్-ఫైబర్‌తో స్లైడ్) సీ సా జంగిల్ జిమ్, రైన్‌బో లాడర్, టు సీటర్ స్వింగ్. పరిమాణం : ఒక్కొక్కటి. బిడ్ దాఖలు ప్రారంభ/ముగింపు తేదీలు, సమయం : 11.07.2024 & మ.12.30గం., 15.07.2024 & మ.12.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9154796465. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

DIPR.No.1764-PP/CL/Advt/1/2024-25 తేదీ: 12.07.2024 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.28, GHMC.


## నిజాంపేట్ బిజెపి కార్పొరేషన్ అధ్యక్షులు,కమిటీ సభ్యులు మూకుమ్మడి రాజీనామా



రాజీనామా చేసిన బిజెపి సభ్యులు

**నిజాంపేట్, జూలై 12, ప్రభాతవార్త** నిజాంపేట్ కార్పొరేషన్‌లో పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర జిల్లా అసెంబ్లీ స్థాయి నాయకులు కొందరు కుట్రపూరితంగా కార్పొరేషన్‌లో చురుగ్గా పనిచేస్తూ కొనసాగుతున్న పార్టీ కమిటీని ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయకుండానే ఈనెల 9వ తేదీన మూడు గ్రామాలకి గ్రామ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై నిజాంపేట్ కార్పొరేషన్ కమిటీ తీవ్ర దిగ్భ్రాంతికి గురికావడమే కాకుండా అభ్యంతరాలు వ్యక్తం చేసిన పట్టించుకోకపోవడంపై శుక్రవారం నిరసన వ్యక్తం చేస్తూ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్, కమిటీలో వివిధ భాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పార్టీ ఎదుగుదలను ఓర్వలేక రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయి బాధ్యతల్లో ఉన్న నాయకులు ఈ విధంగా చేయడం, వైరిపక్ష ప్రజా ప్రతినిధికి లబ్ధి చేకూర్చే విధంగా పార్టీలో ఇలాంటి నిర్ణయాలు చేయడంపై తీవ్ర అభ్యంతరం తెలియజేయడమైందన్నారు. పార్టీ పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, పార్టీలో నియమ నిబంధనలకు వ్యతిరేకంగా, ఇష్టారాజ్యంగా కొందరు సీనియర్ నాయకుల చర్యలపై రాష్ట్ర, కేంద్రపార్టీ దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, కాశి, అరుణ్‌రావు, శ్రీనివాసరావు, విజయ్ కుమార్, తిలోక్, రాము, కవితరెడ్డి, ముఖేష్, కుమార్‌గౌడ్, పట్నాయక్, మాధవరావు, ప్రదీప్ కుమార్, ఎల్లస్వామి, శ్రీనివాస్, హనుమయ్య, చిరంజీవి, మోక్షశ్రీ, నరోత్తంరెడ్డి, వెంకటేష్, కృష్ణ, రాజేష్, వరుణ్‌రెడ్డి, నవీన్, సందీప్, యాకూబ్, సుధాకర్, మహేష్, అనునియ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులను బిజెపిలో కలిపి కవిత బెయిల్ తీసుకోవాలని ప్రయత్నం
### -టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త** సిరిసిల్లలో పవర్‌లూమ్ క్లస్టర్ కావాలని లేఖ రాయడానికి మీకు సిగ్గనిపించలేదా కేటిఆర్ పదేళ్ల అధికారంలో ఉండి మీరెందుకు క్లస్టర్ ఏర్పాటు చేయలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ధ్వజమెత్తారు. కేటిఆర్ సిరిసిల్లకు పవర్ లూమ్ క్లస్టర్‌ను మంజూరు చేయాలనీ బండి సంజయ్‌కి లేఖ రాయడాన్ని ప్రశ్నిస్తూ ఈ శుక్రవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి సూటిగా ప్రశ్నిసూనత కేటీఆర్, హరీష్ రావులు నిన్నటిదాకా ఢిల్లీలో ఆరు రోజులు పడిగాపులు పడ్డారు. ఆ పడిగాపుల్లో అక్కడ చెల్లి బెయిల్ కోసం, పార్టీ విలీనం కోసం బేరం కుదిరిందో లేదో తెలీదని, టిఆర్‌ఎస్ కాస్త బిఆర్‌ఎస్ అయింది, బిఆర్‌ఎస్ కాస్త బీజేపీ కాబోతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కి వచ్చిన ఓట్ల శాతం చూస్తూనే తెలిసిపోతుందని దాదాపు 20శాతం ఓట్లను డైరెక్టుగా బీజేపీ, బిఆర్‌ఎస్ వేయించిందని, బిల్లా రంగలిద్దరూ ఢిల్లీకి వెళ్లి రాజ్యసభలో ఆరుగురు బిఆర్‌ఎస్ సభ్యులను బీజేపీలో కలిపి కవిత బెయల్ తీసుకోవాలని కేంద్రమంత్రులతో మంతనాలు జరిపారని అన్నారు.

## పూల అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన భూలక్ష్మీ అమ్మవారు

**బేగంపేట జూలై 12,ప్రభాతవార్త** ఆషాడమాస బోనాల ఉత్సవాలలో భాగంగా బేగంపేట ప్రకాశంనగర్ శ్రీభూలక్ష్మీ అమ్మ వారు శుక్రవారం రోజున పూల అలంకారంతో కన్నుల పండువగా భక్తులకు దర్శనం ఇచ్చారు.రానున్న వారాల్లో ప్రతి వారం ఒక అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ నిర్మాణదాత విశాల్ సూధం శుక్రవారం ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా పటిష్ట మైన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేసారు.శాఖాంబరీదేవి అలంకారం, గాజులతో అలంకారం,పండ్లతో అలంకారం ఉంటుందన్నారు.ప్రతి శుక్రవారం భగవద్గీత పారాయణం చేస్తున్నట్లు విశాల్ సూధం తెలియజేసారు.భక్తులు అమ్మ వారిని దర్శించుకుని అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## పార్కుల సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలి : కార్పొరేటర్

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో వివిధ పార్కుల సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పి అండ్ టి కాలనీపార్కును బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, హార్టికల్చర్ విభాగం సర్కిల్ మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ వికాస్ తదితరులతో కలిసి పరిశీలించారు. పనులకు ఎందుకు ఆటంకం కలుగుతుందని కార్పొరేటర్ అధికారులను ప్రశ్నించగా నిధుల కొరత కారణంఎదైనా ఉంటే ప్రత్యేక చర్యలు తీసుకుని మంజూరు చేయిస్తానని, పార్కు అభివృద్ధి పర్చడంలో రాజీపడేదిలేదన్నారు. పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పార్కుచుట్టూఉన్న కాలనీ వాసులు ఫిర్యాదుచేశారని, ఎట్టి పరిస్థితుల్లో పార్కు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్‌కు ఛైర్మన్‌గా భాధ్యతలు స్వీకరించిన మానాల మోహన్‌రెడ్డిని అభినందించి, శుభాకాంక్షలు తెలుపుతున్న నిజామాబాద్ డిసిసి ఉపాధ్యక్షుడు ఆర్.దయాకర్‌గౌడ్


వార్త VAARTHA CLASSIFIEDS

**ANNOUNCEMENT**

★ Loss pof Passport No S9244543. Lost it in between Musarambagh and kothapet on 14/3/2024. if found pl send to Cell: 8374788886.
(Ro.No.14957)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE XI-ADDL. JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD.
O. S. No. 471 of 2024
Between:
**Smt. Kalapala Sampoorna,** W/o. Late. Sri. K. Samson George, aged about 75 years, Occ: Household, R/o. H.No.12-5-113/102, Vijaypuri, South Lalaguda, Tarnaka, Secunderabad-500017 ...Plaintiff
AND
**1) The Tahsildar,** Marredpally Mandal Revenue Office, Hyderabad District, Office at Ridgewood Residency, St. No. 7, Aswini Colony, West Marredpally, Secunderabad, Telangana 500026
**2) All Concerned ...Defendants**
To,
**All Concerned,**
Whereas the above named plaintiff has filed the above suit for seeking to declaration to declare her as the Legal Heir and successor of Late. Sri. K. Samson George, who was died on 24.08.1994, wherein the Hon'ble court was pleased to pass orders by permitting the plaintiff to serve substitute service of summons to the 'All Concerned'.
Hence 'All Concerned' are hereby directed to be present before the above said court on 2.8.2024, at 10.30 A.M., either in person or through Advocate, failing which the matter will be decided ex-parte against you.
(BY ORDER OF THE COURT)
**Sd/- T. KIRAN KANTH REDDY ADVOCATE**
H.No.11-15-146/1, Flat No.G-1, Sai Ayyappa Nilayam, J.B.Colony, Road No.3, Saroornagar, Hyderabad -35, **Ph.No.9246164335**

IN THE COURT OF THE HON'BLE XXIV ADDL CHIEF JUDGE, CCC, HYDERABAD DIST, AT : HYDERABAD.
M.V.OP. No. 280 OF 2022
Between:
**PATHURI VENKATRAM REDDY S/o P. RAJI REDDY,** Age about 42 years, OCC: NIL, R/o H.No.42-189, Last Bus Stop, Jagathgirigutta, Qutbullapur Mandal, Medchal Dist. **...PETITIONER**
AND
**SRI GONE SREEKANTH & 2 OTHERS ...RESPONDENTS**
**1. GONE SREEKANTH** S/o G. KUMARA SINGH, Aged about 28 Years, OCC: PST Office Employee, **3. Smt. BHARATHI PRASANNA** W/o GONE SRIKANTH, Aged 26 Years, OCC: House Hold.
Both R/o H.No.3-127/2, Near Narsangi P.S. Narasangi, Ranga Reddy Dist.
**NOTICE**
Madam/Sirs,
Whereas the above named Petitioner filed the above O.P for compensation. Who met with an accident on 11.09.2021 at about 01:30 near Broadcom Gachibowli, Hyderabad. The Hon'ble Court has directed to serve the Notice to the Respondent No.1 & 3 by way of publication in the News Paper. Therefore, the respondent No.1 & 3 shall appear before the above Hon'ble Court. The Hon'ble Court posted the matter on **24.07.2024** at 10.30 A.M. for your appearance. Therefore you are requested to appear before the Hon'ble Court on **24.07.2024 at 10.30 A.M.** in person or through Counsel duly represented. Otherwise the matter will be decided exparte in your absence.
"By Order of the Court"
**B. PRABHAKAR REDDY AP.1068/2004. Advocate Counsel for the Petitioner**
H.No.11-10-85/3, Road No.4, S.B.I. Colony, Kothapet, Saroor Nagar, Hyderabad-35

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD.
O. S. No. 464 OF 2024
BETWEEN:
**1. Smt. Konnoju Kasturi,** W/o. Late Nageshwar Chary Madupoju, Age: 35 years, Occ: Housewife,
**2. Shrenika Madupoju,** D/o Late Nageshwar Chary Madupoju, Age: 8 years, Occ: Student,
**3. Aadriti Madupoju,** D/o Late Nageshwar Chary Madupoju, Age: 8 years, Occ: Student,
**...PLAINTIFFS**
(ALL are Residents of Plot No.25, Flat No.202, Excel Residency, Indrapuri Colony, West Marredpally, Secunderabad-26)
(Plaintiffs No.2 & 3 beings minors are rep by Mother & Natural Guardian Plaintiff No.1 herein)
AND
**1) The Tahsildar, Marredpally Mandal & All Concerned ...DEFENDANT**
1. To,
**Defendant No.2**
**Whosoever All Concerned**
Please take notice that the above Plaintiff have filed the above suit for Declaration as Legal Heirs of Late Nageshwar Chary Madupoju who expired on 31.10.2022, for legal status only. The above said suit now stands posted on **26.07.2024 at 10.30 AM** in the above court. If anybody is having any objections or claims may approach this Hon'ble Court with valid documents, either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
//BY ORDER OF THE COURT//
**Sd/- S. DHANANJAY Advocate**
Plot No.150, Durga Vihar Colony, Tirmulghery, Secunderabad-15 **Mobile: 9885879999**

IN THE COURT OF THE HONORABLE 11th JUNIOR CIVIL JUDGE AT: SECUNDERABAD
OS No: 216 of 2024
BETWEEN:
**1) Smt. Borra Saraswathi** W/o. Sri. Borra Subrahmanya Reddy
**2) Sri. Boraa Govardhan Reddy** S/o. Sri. Boraa Subrahmanya Reddy
**3) Sri. Boraa Ravi Kumar Reddy** S/o. Sri. Borra Subrahmanya Reddy
All are R/o. Plot No. 13, Banjara Nagar, VTC, Tirumalgiri, Secunderabad., T.S. (All three are presently residing at USA)
All three are represented by their GPA holder Sri. Thumma Fathima Mareddy S/o. Sri. Innareddy, Aged about 72 Years Occ: Business, R/o. Plot No. 161, Ravi Colony, Opp: RTC Colony, Tirumalgiri, Secunderabad, T.S.
**...Petitioners/Plaintiffs**
AND
**1. MRO/Tirumalgiri, Secunderabad**
**2. All Concerned ....Respondents/Defendants**
Sir/Madam,
Please take notice that the above petitioners have filed Suit for Declaration of Legal Heirs (Legal Status) in O.S. 216/2024, and the same stands posted on **02.08.2024.** If any person has any objections in respect of the above Suit they may appear in person or through an Advocate on the said date otherwise the matter will be decided ex-parte.
//By the order of the Hon'ble Court//
**DEVAKAR. P, G.V.S. RAMARAO Advocates**
Plot No.180, Road No.4, Trimoorthy Colony, Mahendra Hills, Secunderabad-26 **Cell: 98490 25380**

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT : AT SECUNDERABAD
O.S. No. 452 of 2024
Between:
**Siddigari Vijaya & Others ...Plaintiffs**
AND
**1. The Tahsildhar,** Marredpally Mandal, Hyderabad District
**2. All concerned ...Defendants**
**NOTICE**
To
**1. All concerned ...Defendant No.2**
Please take notice that, the Plaintiffs filed the suit against you for declaration of Plaintiffs as legal heirs of Late Siddigari Krishna and the same is posted on **25.07.2024.** That the general public who ever may concerned can appear before the above said Hon'ble Court on **25.07.2024 at 10.30 AM** with objections if any in support of your claim or else the Hon'ble Court will proceed for granting legal heirs certificate in favour of the Plaintiffs.
// BY ORDER OF THE COURT //
**Sd/- P. SREE PRAKASH, D. SHAM SUNDER & I. SRINIVAS Advocates**
H.No.10-456/2, PVN Colony, Malkajgiri, Hyderabad-500047 **Cell No.8555998931**

## ఆర్ అండ్ బి భవనంలో రాష్ట్ర మంత్రి వెంకట్‌రెడ్డితో ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి భేటీ



మంత్రి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఛైర్మన్ రాంరెడ్డి

**హైదరాబాద్, జూలై 12 ప్రభాత వార్త :** శుక్రవారం ఎర్రమంజిల్‌లో ఆర్ అండ్ బి భవనంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ హరి చందన దాసరితో రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి ఎల్బీనగర్-మల్కాపూర్ జాతీయ రహదారిలో పనామాగౌడౌన్,ఆటోనగర్, హయత్‌నగర్‌లో నిర్మిస్తున్న అండర్ పాస్‌లను ఎర్త్ వాల్‌లకు బదులుగా కాలమ్ స్ట్రక్చర్‌తో నిర్మించడానికి కావలసిన అదనపు నిధులు సమకూర్చాలని కోరుతూ మంత్రి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



చిల్డ్రన్స్ పార్కులో ఎక్విప్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 12 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డి డివిజన్ వైదేహినగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్-1 పార్కులో శుక్రవారం ఎల్‌బినగర్ నియోజక వర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహాయ సహకారాలతో పార్కులో చిల్డ్రన్ ఎక్విప్‌మెంట్, వాకింగ్ ట్రాక్‌లో టైల్స్ ఏర్పాటు చేసామన్నారు. అసోసియేషన్ తరపున కాలనీవాసులు తరపున ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేసారు. అనంతరం ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడి పార్కులో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్‌చౌదరి, బుచ్చిరెడ్డి, సతీష్‌గౌడ్, శివశంకర్, శ్రీకాంత్, రాంగోపాల్, మనోజ్, వైదేహినగర్ నార్త్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గట్టు గిరికి పద్మ ప్రతిభ అవార్డు

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** అనాధలు, అభాగ్యులకు చేస్తున్న సేవలకు గాను నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరికి పద్మ ప్రతిభ అవార్డు లభించింది. తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు మనం ఫౌండేషన్ వారు డాక్టరేట్ ప్రదానం చేసి అవార్డును అందజేశారు. ప్రముఖులు సుమన్, సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా ఆయనకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గట్టు గిరి ఫౌండేషన్‌కు చెందిన చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

## టిఎక్స్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్




టిఎక్స్ ఆసుపత్రిలో రోగికి అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యుల బృందం

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో హిరాయామా వ్యాధితో బాధపడుతున్న రోగికి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. అరుదైన న్యూరాలాజికల్ చికిత్స విధానాన్ని 1959లో కనుగొన్నారని, మరోసారి చికిత్స విజయవంతంగా నిర్వహించి మరో మైలు రాయి దాటినట్లు టిఎక్స్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా.శ్రీకాంత్ వోద్నాల తెలిపారు. టిఎక్స్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డా.నరేష్‌కుమార్ గజ్జాల నేతృత్వంలో అనస్తిటిస్ట్ డా.సందీప్‌కుమార్, నిర్వహణ బృందం డా.కీర్తికర్‌రెడ్డి, డా.దీపక్‌రాజు, రవీంద్రరెడ్డి సహకారంతో ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సెర్వికల్ స్పైన్‌లో కాంప్రెషన్ తగ్గించేందుకు అధునిక పద్ధతులు ఉపయోగించి సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా.నరేష్ కుమార్ మాట్లాడుతూ హిరాయామా వ్యాధి చేతులు, మణికట్టు, కండరాల బలహీనతను కలిగించే పరిస్థితి ఉంటుందని, సాధారణంగా వయస్సుతో పురోగమిస్తుందని తెలిపారు. ముఖ్యంగా 20 ఏళ్ల వయస్సు ఉన్న పురుషులను ప్రభావితం చేస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా ఈ హిరాయామా కేసులు తక్కువగా నివేధించబడ్డాయని తెలిపారు. ఆసియా దేశాలలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రోగి లక్షణాలను తగ్గించడంతోపాటు, వ్యాధి మూల కారణాన్ని పరిష్కరించడం ద్వారా మరింత మెరుగైన చికిత్సలు అందించేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

## రామంతాపూర్‌లో వాక్సిన్ సెంటర్ పరిశీలన : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**రామంతాపూర్, జూలై 12 ప్రభాతవార్త :** రామంతాపూర్ రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న వాక్సిన్ సెంటర్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్నారులకు నిర్ణీత గడువులోగా వాక్సిన్ వేయించాలని కోరారు. చిన్నారులకు ఎటువంటి రోగాలు రాకుండా విధిగా వాక్సిన్ వేయించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానాను పరిశీలించారు. మరో రూ.2లక్షల నిధులు కేటాయిస్తే బస్తీ దవాఖానా నిర్మాణం పూర్తవుతుందని, నిధులు కేటాయించాలని కార్పొరేటర్ శ్రీవాణి సూచించారు.అధికారులతో చర్చించి నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, బోసాని పవన్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు ప్రగతికి మెట్లు : డిసిఎస్‌వో రాథోడ్



మొక్కను నాటుతున్న రాథోడ్

**తుర్కయంజాల్, జూలై 12 ప్రభాతవార్త :** చెట్లతోనే జీవకోటి మనుగడ, ప్రాణ వాయువుకు మూలాధారం పచ్చదనం అని పౌర సరఫరాల శాఖ రంగారెడ్డి జిల్లా సరఫరా అధికారి మనోహర్ కుమార్ రాథోడ్ ఉద్ఘాటించారు. శుక్రవారం ఆయన తుర్కయాంజాల్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్‌కే. రాథోడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు. అనంతరం పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిటి మాచన రఘునందన్ మాట్లాడుతూ అధికంగా చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డిటీ హనుమా రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



గోవర్దన్‌కు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, జూలై 12 ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నగరంలోని ఎండోమెంట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డిలతో కలిసి ఆయన పలువురు ఆలయాల నిర్వాహకులకు చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1058 ఆలయాలకు సుమారు 4 కోట్ల 82 లక్షల 49 వేల 300ల రూపాయలను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 96 ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఆలయాలవద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆలయ ప్రతినిధులు నర్సింహ్మా, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ముదుపు రాజిరెడ్డి తదితరులు

**సైదాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో కొనసాగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి శుక్రవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హన్మంతరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ చంపాపేట డివిజన్‌లోని సమస్యలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బెనర్జీ, శంబుప్రసాద్, బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బొంబాయి యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ రాగన్నగూడ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వీడ్కోలు, స్వాగత సభ

**తుర్కయంజాల్, జూలై 12 ప్రభాతవార్త :** ఎన్ఎస్ఆర్‌నగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రవణ్ కుమార్ 11సంవత్సరాలుగా విద్యార్థులకు వారి సేవలు అందించి బదిలీపై వెళుతున్న సందర్భంగా లయన్స్ క్లబ్ రాగన్నగూడ వారి ఆధ్వర్యంలో వీడ్కోలు సభతోపాటు బదిలీపై వస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు కృష్ణలకు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ 320 సి జోనల్ ఛైర్మన్ ఎల్మటి వెంకట్‌రెడ్డి, లయన్స్ క్లబ్ రాగన్నగూడ అధ్యక్షులు సామ భీమ్‌రెడ్డి, కోశాధికారి మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్యగౌడ్, స్కూల్ ఛైర్మన్ దివ్య, దాసరి సుధాకర్‌రెడ్డి, జూపల్లి వెంకటేశ్వరరావు, సామ అల్వాల్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, భద్రయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని విజయవంతం చేసారు.

## టిజిఎస్ ఆర్టీసీ కార్గో ఏజెంట్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హయత్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం ఆధ్వర్యంలో కార్గో ఏజెంట్ల నియామకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆర్టీసీ కార్గో ఏజెంట్ డెవలప్‌మెంట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మురళీధర్ తెలిపారు. హయత్‌నగర్, చార్మినార్ డివిజన్లలో ఉన్న డిపోల పరిధిలోని ఎల్‌బినగర్, బి.ఎన్.రెడ్డినగర్, సాగర్‌రింగురోడ్డు, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అలీకేఫ్, కర్మన్‌ఘాట్, సంతోష్‌నగర్, ఇబ్రహీంపట్నం, మిథాని, చంద్రయాన్ గుట్ట ప్రాంతాలలో ఏజెంట్లను నియమించనున్నట్లు ఆయన తెలిపారు. 10 రూపాయల నామమాత్ర ఫీజుతో నియామకాలను చేపట్టనున్నట్లు వివరించారు. ఆసక్తి కల నిరుద్యోగ యువతీ, యువకులు, చిరువ్యాపారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 73861 87599, 91542 98781 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ఘనంగా శ్రీ వారాహి అమ్మవారి ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, జూలై 12 ప్రభాతవార్త:** భక్తుల కోలాహల మధ్య శ్రీవారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆర్కేపురం కుర్తాల పీఠం ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతున్న శ్రీవారాహిదేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అదేవిధంగా శ్రీవారాహిదేవి సమేత శ్రీప్రత్యంగిరా పరమేశ్వరిదేవికి విశేషఅభిషేకాలు, కుంకుమార్చన, పారాయణం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాలలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ మునిపల్లి శ్రీనివాసరావు వారికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ పాల్గొన్నారు.

## వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : మేయర్ దుర్గ

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్ చౌహాన్ ప్రజలకు సూచించారు. తన స్వంత డివిజన్ 15లోని మిథిలానగర్ కాలనీలో శుక్రవారం ఆమె కమిషనర్ చంద్రశేఖర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్ ఇంద్రసేనారెడ్డి తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల ఇళ్ళల్లో మొక్కల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి ఇళ్ళ పరిసరాల్లో చెత్తా చెదారాన్ని సైతం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్పొరేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షురాలు హారతి వెంకటేశ్వర్లు, ఫణిరాజ్ పాల్గొన్నారు.

## సిద్ధార్థ హైస్కూల్‌లో డెంగ్యూ అవగాహన

**మల్కాజిగిరి, జూలై 12 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్ డివిజన్ యాదవ్‌నగర్‌లోని సిద్ధార్థ హైస్కూల్‌లో జి.హెచ్.ఎం.సి ఎంటమాలజీ ఆధ్వర్యంలో జరిగిన డెంగ్యూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, రోజుకు కనీసం 10 నిమిషాలు కేటాయించి ఇండ్లలో నిలిచిఉండే నీటిని గుర్తించి వాటిని శుభ్ర పరుచుకుంటే చాలా వరకు డెంగ్యూ ప్రబలే అవకాశాలను తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఎఐ వనజ, సిబ్బంది, సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆనంద్ రావు, బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, సిద్దిరాములు, కిట్టు, నర్సింగ్‌రావు, భిక్షపతి, నాగేష్‌గౌడ్, బాచి, మహిళా నాయకులు, అనిత, వరలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లలో మేయర్ పారిజాత పర్యటన..



మేయర్‌కు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని 3, 24 డివిజన్లలో శుక్రవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించి సమస్యలను పరిశీలించారు. కార్పొరేషన్ డిఇఇ జ్యోతిరెడ్డి, ఎఇఇ వినీల్‌గౌడ్‌లతో కలిసి ఆయా డివిజన్లలోని కాలనీలలో పర్యటించి డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా 24వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి తదితరులు మేయర్‌కు సమస్యలను వివరించారు. అదే విధంగా 3వ డివిజన్‌లో బిజెపి నాయకులు రామిడి శూరకర్ణారెడ్డి, వీరకర్ణారెడ్డిలు వివిధ సమస్యలను మేయర్ దృష్టికి తెచ్చారు. అనంతరం మేయర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.బోనాలపండుగ సందర్భంగా గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ మాజీ జడ్పీటిసి బంగారు సత్యనారాయణ, నాయకులు కుంచె నాగేందర్‌గౌడ్, బోయపల్లి వెంకట్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, ఏనుగు తిరుమల్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హస్తినాపురంలో వన మహోత్సవం



వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 12 ప్రభాతవార్త:** హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ ఫేస్-1 లో అర్బన్ బయోడైవర్సరీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ ఛైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతనాయక్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం రామిరెడ్డి మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అర్బన్ బయో డైవర్సిటీ చంద్రశేఖరరావు, సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్, గణేష్, గోపి, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 20 లక్షలతో స్మశాన వాటిక స్నానాల గదులు ఏర్పాటు : కౌన్సిలర్ సునీల్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సునీల్ తదితరులు

**తుర్కయంజాల్, జూలై 12 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 18వ వార్డులోని 20 లక్షల బడ్జెట్‌తో స్మశాన వాటిక వద్ద నూతన స్నానాల గదుల నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్, తెలంగాణ పిసిసి సభ్యులు కాకుమాను సునీల్ శుక్రవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి సహకారంతో వార్డుని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువు తాతిరెడ్డి జయరాజు, సహ గురువు మాదాను ఆరోగ్యస్వామి, చర్చ్ కమిటీ సభ్యులు కాకుమాను ఆరోగ్యం,అడ్డగట్ల మరియరాజు, కాకుమాను అంకిత్, గ్రామ పెద్దలు భోనగిరి మరియన్న, కాకుమాను మార్తయ్య , 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకుమాను రాజు, పోలిశెట్టి వినయ్, ఆకురాతి రాకేష్, రమేష్, ప్రకాష్, థామస్, జోహార్, సంతోష్ , రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకోసం మార్షల్ ఆర్ట్స్ : మాధవిలత



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తు్న మాధవిలత

**మలక్‌పేట, జూలై 12 ప్రభాతవార్త :** ఆత్మరక్షణకోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని బిజెపి నాయకురాలు మాధవిలత పేర్కొన్నారు. కోచ్ ఆదిమూల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 2024 పోటీలలో విజయం సాధించిన కాచిగూడ రా కాంబాట్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. అనంతరం కోచ్ కృష్ణ మాట్లాడుతూ తమ అకాడమికీ చెందిన విద్యార్థులు 6 బంగారు పతకాలు, 4 రజత, 1 కాంస్య పతకం సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో విజేతలు క్రిష్, ప్రబాల్, దేవాష్, విఘ్నేష్, ఫరీద్, విశాల్, జాన్, సాయి, అజయ్, కృష్ణ, రణవీర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మహిళా సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా శ్యామల రమణి నియామకం



నియామకపు పత్రాన్ని తీసుకుంటున్న శ్యామల రమణి

**తార్నాక, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ మహిళా సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా శ్యామల రమణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా సేవాదళ్‌ఆర్గనైజర్ భవానీ ఉత్తర్వులను జారీ చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామల రమణికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్యామల రమణి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి భాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మహిళా సేవాదళ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## సమిష్టి పోరాటాలే తెలంగాణను జాతీయ స్థాయిలో నిలబెట్టింది : ప్రొఫెసర్ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

**ఎల్.బి.నగర్, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలసమిష్టి పోరాటం కృషి ద్వారానే తెలంగాణ వచ్చిందే తప్ప ఏఒక్కరి వల్ల సాధ్యం కాలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. కొత్తపేటలోని బాబుజగ్జీవన్ భవనంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఛైర్మన్ కాచం సత్యనారయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యమకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించగా కోదండరాం, విమలక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యమకారులు ముఖ్యపాత్ర పోషించారని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే రాష్ట్రంలో సమస్యలు పరిష్కారమవుతాయనే ఆలోచనతో లక్షలాదిమంది ఉద్యమబాట పట్టారని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడ కూడా ఒక రాష్ట్రం కోసం ఇలాంటి ఉద్యమం జరిగిన దాఖలాలు లేవన్నారు. బలిదానాలపై జాతీయస్థాయిలో సరిగా అధ్యయనం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఛైర్మన్ సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు బాధ్యత కోదండరాంసార్‌కి అప్పగిస్తామని, అసలైన నికార్సైన ఉద్యమకారులకే న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇస్తానని హామీ ఇచ్చిందని ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీ.రంగారెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి, పల్లె వినయ్. బీరెల్లి వెంకటరెడ్డి, శ్రవణ్, ఖలీల్, కాచం సుష్మా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తాం : కార్పొరేటర్ నర్సింహ్మారెడ్డి



ప్రహరీని ప్రారంభిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** ప్రజా సేవకుడిగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హయత్‌నగర్ ప్రాంతంలోని సిరిహిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కు ప్రహరీని ఆయన శుక్రవారం కాలనీ సభ్యులతో కలిసి ప్రారంభించి మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్కు స్థలం కబ్జాకు గురికాకుండా పరిరక్షించుకున్న కాలనీ సభ్యులను ఆయన అభినందించారు. ట్రంక్‌లైన్ పూర్తయిన వెంటనే కాలనీకి ఉన్న ప్రధాన రోడ్లతో పాటు ఇతర కాలనీలకు ఉన్న లింకురోడ్లను పూర్తిచేస్తామన్నారు. వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో కాలనీలో ప్రతిఒక్కరు పచ్చదనాన్ని పెంపొందించుకునేందుకు ఇళ్లల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నందికొండ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, ప్రతినిధులు వెంకటేష్‌గౌడ్, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించినప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా జన శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని మూడు గుళ్ల వద్ద ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణా కేంద్రాన్ని పిఐ మాలకొండయ్యతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిధులిచ్చి సమస్యలను పరిష్కరించాలని వినతి : కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి పుష్ప గుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ డివిజన్ జీహెచ్ఎంసీకి శివారు ప్రాంతం కావడంతో అభివృద్ధిలో ఒకింత వెనుకబాటులో ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయని, కనీస మౌళిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి అదనపు నిధులను కేటాయించాలని కోరారు.

## ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రికి కార్పొరేటర్ సునీత వినతి

**మల్కాజిగిరి, జూలై 12 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ శుక్రవారం రాత్రి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. దశాబ్ద కాలంగా గౌతమ్‌నగర్ గేటు వద్ద నిత్యం గేటు పడుతుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, అత్యవసర వాహనాలు గంటల తరబడి నిరీక్షిస్తున్నాయని తెలిపారు. రానున్న పార్లమెంట్ బడ్జెట్‌లో మాట్లాడి గౌతమ్‌నగర్ రైల్వే గేటు వద్ద ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్‌ను కోరారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలని వినతి

**ఉప్పల్, జూలై 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని సిపిఎం పార్టీ నేతలు శుక్రవారం ఉప్పల్ డిసి అంజనేయులు కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి జె.వెంకన్న, ఎం.వినోద, జె.ఉపేందర్, వై.వెంకటేశ్వర్లు, పెద్దస్వామి, పద్మ, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆరాఉ గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే వీటిని అమలు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం పార్టీ నేతలు పాల్గొన్నారు.